
ఓం శ్రీ పరమాత్మనే నమః

సాయి శివహరి ఓం

శ్రీసాయి సుదర్శనగీత

# లయ పటలం

## అష్టాదశ అధ్యాయము — మోక్ష సన్యాస యోగము



### (01) (10-12; నూటమూడవ రోజు)

| | |
|---|---|
| 1. | కదళీ ఫలంబున కవితనై పలకనా! భవిత కోరిన.. చెప్పనా భక్తా! భక్తి నీకున్న బానిసై పల్కనా....! |
| 2. | కనుగొనక లేదంటివి కనుగొన లేనంటివి, కన్నుల నిండా కాంక్షలుండ కన్నులర మూసి ధ్యానింప కనగలవే నన్ను.! |
| 3. | బొరా ! ఘనత నేమని చెప్పుదు గన గన నగుబాటు కాదే నీ డెంద మందున నన్ను నిలపవు<br>నిన్ను అందల మెక్కించ నగుదురు గాదే...! |

### (02) (11-12; నూటనాలుగవ రోజు)

| | |
|---|---|
| 4. | సకల సద్గుణముల ఖని ఉత్తమోత్తముండవని ప్రస్తుతించ నే అవనిన ఏ పురుషుండు మిగలడే<br>శతశతాధికంబగు జీవులలో కొలికి ముత్యమై.. ఒక్క ఉత్తమ జన్మ పురుషుండు నుండబోడె...! |
| 5. | పుణ్యము, పురుషార్ధము నెరిగిన మానవుడె మాధవుని జేర అర్హుండగును<br>ఏడేడి కంచు కాగడలు పెట్టిన కనిపింపడె నా కన్నుల జ్యోతియై నిలువ ఉత్తమ పురుషుండు...! |

| | |
|---|---|
| 6. | పునీతలు కాని మీ బ్రతుకేపాటి గుడిచేటి బ్రతుకు గాక కొంగ జపముల్,<br>దొంగ తపముల్ జేయ నీ ఉసురుల్ తరుగుటే కాని తరుణోపాయం బెన్నడు కల్గునో? |
| 7. | శిష్యా! నిముష నిముషంబున నొక్కి పక్కికి పక్కిగా.. చెప్పిన నీతుల్ మందమతివై చెవిన్ పెట్టక<br>పెడదోవల బోయెవే వెర్రి కుంకవై...! |
| 8. | కుంకుడు రసమున ముంచనా, కుబుసము వీడిన కాలనాగుచే కరిపించనా..<br>ఏ రీతుల్ బోవ నే...రీతి తరింతురయ్య నే నంతన్ చెప్పనేర్తున్...! |
| 9. | సుఖము కన్న సౌఖ్యంబు లేదంటివి, సత్యము మిన్న అతి సుందరం కన్న<br>మంచి తనమును మించు మరి గుణము లేదు శాంతము కన్న సౌఖ్యంబు లేదు...! |
| 10. | నీ మనసే నీకు మరి శత్రువగునా విడమరచి చెప్పిన నీవు వినని ముచ్చట్లెన్నో<br>అయినా చెప్పెద వినుము, అసూయ పనికి రాదు...! |
| 11. | మనిషి, మనిషికి మధ్య రగిలించు అసూయ.. అది నిన్ను దహించుచున్న నేను దరియలేను<br>పాపముల పడదోసు, పతితుడవై దోచు పరమ అసహ్యకర అసూయ నీదరి జేరనీకు...! |
| 12. | ఈర్ష్య మరచిన కాని, పరమేశు చేరలేవు అవగుణముల కన్న, అసూయ మిన్న<br>ఈర్ష్య నిడువకున్న కలుగు కెడబాటు.. ఈర్ష్య లేని మనిషి ఈశుడై తోచును...! |
| 13. | పరమేశు దరిచేరు, పరమ పదమును గోరు.. పదే పదే చెప్తున్నా పడకు నరకమున<br>ఈర్ష్య అసూయలు, భగ్గున దహించు నిన్ను పరమేశుని జేరి — పావన పదముల శరణు గోరు...! |
| 14. | ఈర్ష్య, అసూయలు ఇంతై నంతై.. అభోనాంతరములై తార మండలంబు దరిశి — నీలో దాగెనే కాని<br>ఏ నాటికి పుణ్యదరి చేర్చలేవు...! |
| 15. | ప్రాణి జన్మలోన నరజన్మ మంచిది ఈ జన్మన ఏటికి — అధముండ వవుదువు<br>ఈర్ష్యా అసూయలకు ఆహుతివై అధమ పాతాళాన పడిపోదువేమో...! |
| 16. | ఈర్ష్య నీకేల ఈసారన్నా సాయీశు చేరు.. పంచ గంగల్లోన మునగంగ పోవునా మరి ఈర్ష్య భగ్గుమనగా<br>ఏ గంగలో ముంచినా, ఏ అగ్గిన కాల్చినా, ఈర్ష్య నిను విడకున్న పశువుకన్న నీవు అధమాధముండవు...! |
| 17. | నాల్గు కాళ్ళ పశువు నీ కన్న మిన్న.. బుద్ధిచ్చి బుద్దులు చెప్తున్న<br>జీవి జీవిపై ఈర్ష్యా అసూయల్ పెంచేటి ఓరన్న పెడదోవలం బోకు — నీ దోవ అది కాదు...! |
| 18. | గంగలో వదిలేయి — నీ వక్ర బుద్ధుల్.. ఈర్ష్యా అసూయల్ పంచాతి పాపముల్<br>నిన్ను దహించక మున్నే — వాటిని నీట ముంచు పుటన పెట్టిన పుత్తడై ఉత్తమ పురుషుండై పుడమిన మెరియు...! |
| 19. | అన్నన్నా ఆనాడే దోచు నీకు సాయన్న అసూయలేని అనసూయ పుత్రుండ అత్రి దత్తుండ!<br>నా ప్రియభక్తుండ! నా వారసుండ! విడువుము..విడువుము నాకేల ఈర్ష్య...! |
| 20. | దహియించు ఈర్ష్యను..దరిచేరు దత్తును..నేను నిన్ను దర్శింతు ఆనాడు దత్తదేవుండనై |

| | |
|---|---|
| | ఈర్ష్య అసూయలు విడనాడు నాడు ఈషుండవై నీవు వెలగంగ గలవు...! |
| 21. | ప్రతిమాలి చెప్తున్నా, భంగపడి చెప్తున్నా - శిష్యుల శిష్యుల కిది, శిష్య కోటుల కిది..అవని తరించనిది ఆరో వేదమయ్యా<br>ఈర్ష్య నీలో జంపి పరమేశు జేరు పదునారు భువనాలు పాలించు ఈశుండు నా భక్త పరమాత్మ నీ లోనే భాసించు...! |
| 22. | నీవేల మునిగెదవు — నీట..మున్నీట మున్ముందు - వదిలేయి ఈర్ష్యా అసూయలు<br>సాయీశు పలుకు - సంగీతమై పలుకు శ్రవణానంద ఆనంద ఆనందాతి ఆనంద బ్రహ్మనై తోచు...! |
| 23. | మకరందమే గ్రోలు — నీవు భ్రమరంబై మంచి సూక్తులు నాకన్నా! ఓ కన్నా!<br>మరి నీకెవరు చెప్పగలరు మంచి తరుణం బోవ మరి రాదు ఈ జన్మము...! |
| 24. | నీ తరమా భక్తా — భవజలధి దాట.. భక్త తారకమైన సాయీశు మాట పంచవేదాలు ..<br>పల్కింతు నీ నోట...ఇది చివరి మాట — ఈర్ష్య అసూయల్ వదలి ఈశుని చేరు...! |
| 25. | కదలిరా కదలిరా — కనకమణిహారమై కదిలించు నీ వెంట శిష్యకోటులను తరలించు, తరలించు<br>ఈ తరము నింక ఇది జగన్నాధరథం — ఇది ఈశు పదం...! |
| 26. | పదము పదము పలుకు — ఇది పసిడి పలుకు సాయీశు పలుకు.. పదము పదము - ఏ పదము చేర్చు ?<br>నీ పరంధామ సాయి పదమును గాగ పిలుపు పిలిపు భక్తి — రవళించి పిలువుము...! |
| 27. | అడుగడుగున ఈర్ష్య అణగ దొక్కి అడుగు అడుగున ఈర్ష్య అధమ పాతాళాన<br>అడుగడుగున్ అణిచి నీ పదములన్ దివ్య పథములన్ చేర్చు...! |
| 28. | నీవు చేరుటయే గాదు — నీలాంటి భక్తులకు అండవై, దండవై, అమృత ఫలాన్నివై నిలు<br>అందించు శ్రీసాయి బోధనామృతముల్ ఆచంద్రార్కము నిలుపు అమరుడై వర్ధిల్లు...! |
| 29. | మనిషి మనిషిన సాయి — మంచి మనసుకు సాయి.. మమత మమతకు సాయి — సమత సమతకు సాయి<br>సఖ్యుండ, ముఖ్యుండ, భక్తులకు భక్తుండ ... మది మదిని సాయీశు మరి కాంచవేరా...! |
| 30. | భక్తికే భక్తుండ శ్రీసాయీశునుండ .. ఏ ఈర్ష్య ఉండ నా అండ నీకుండ నీ కేమి భయము..<br>కదలిరా! కదలిరా! కడలి తరంగమై...! |
| 31. | కన్నీటను ముంచ నీ బ్రతుకు గాదు.. మున్నీట మునగంగ నీ బ్రతుకు గాదు.. శ్రీసాయి సుధవై పదాలు సత్యమై,<br>నిత్యమై నిలవాలని ఉంటే నిల్పుకో ఆనాటి ఏనాటి కీనాటికైనా మున్ముందు ఏ తరానికైనా పనికొచ్చె, పిలిపిచ్చి,<br>నిల్చిపో సాయిగా ననుజేరు ప్రతి భక్త తరంగము సాయీశు రూపుగా ఏ ఈర్ష్యలేక కన్ననాడే కద నాకన్న ఓ<br>చిన్నా నీ బ్రతుకు భవిష్యత్ మూడు కాలాలు నిలుచు సాయీశు చేరు — నీ ఈర్ష్య వదులు...! |

(03) (12-12; నూటఅయిదవ రోజు)

| | |
|---|---|
| 32. | నన్నున్ జేరుదువేని నిన్నున్ జేర్పించెద మోక్షపదమున్ భక్త కైవల్య పదంబున్ నన్నున్ జేరు మార్గములు ఎన్నిన్<br>నీకు లేవు మధ్యన్ వచ్చు మోసకారులన్ నమ్మినన్ మన మధ్య సయోధ్యన్ కల్గింతురే...! |
| 33. | నీ మనసున మనసై సర్వవేళలన్ తనువున్ నిండి నీతో నుండి ప్రతిక్షణమున నీకున్ కన్పించక |

| | |
|---|---|
| | దోబూచు లాడెడి ప్రతి క్షణమున్ నీతో చరించెడి నన్నున్ గానలేవే? దోస్తుడా నేను నీ నేస్తుడనే? |
| 34. | నీకున్ బదులు పూజింపన్ పూజారులా? లేవకో నీకు హస్తముల్ పూజింపన్? చేతగాదకో? మస్తక మేటికి? మంత్రముల్ చెప్పంగ లేని నీ అస్తవ్యస్తపు చదువుల్ వ్యస్తమయే, నను జేర నీకే అవస్తల్, మధ్యవర్తుల్, మన మధ్యన్ సంధి కుదుర్చ, సమాధాన పరులౌదురా? |
| 35. | సరగున చేరంగ..రా నా సరసకున్ నీ కిసుమంతన్ చోటివ్వకుంటివే? దేముండు వరం బిచ్చినన్ పూజారి మధ్య నీ కంద నిచ్చునే! యతులన్ మతిపోయి సద్గతులన్ జేర్చ మంచు వేడెద వేటికి? |
| 36. | సరిపోవు ననుజేరు నాటికి నీ రోజుల్ ఈ మధ్యపు దారులేటికి? నేరుగన్ నా పద మంటినన్ నిన్ పరిపాలించ నంటినా? |
| 37. | నీకున్ నను జేర దారి క్రొత్తల్ గావచ్చునేమో? ఏల ఈ లీల నడ్డంబడి నడ్డు వచ్చు ప్రతి మోసపు అడ్డగాడిదల్ జేర్చునే శ్రీపదములన్ ఇది పద్ధతి కాదు సుమీ...! |
| 38. | నువున్ నాకు కొత్త కాదు ఇది సరికొత్తేమి కాదు నీ ఆత్మన్ అనాదిగన్ నే నెరిగిన వాడినే సుమా! ఈ తోలు తిత్తులంబడి సరికొత్త రూపులు దాల్చుట కొత్త నీకున్ గాని, నాకున్ గాదే...! |
| 39. | నీ వింతల్, ఇంత వింత పోకడల్ పోయెదవేమి? నీ పోగాలము వచ్చినదా? నెంతల్ మంచి చెప్పినన్ సుంతన్ వినక పొద్దున్ పుచ్చుదువు, ఔరా.. ఔరౌర.. నిను నావైపు మల్లింప పోరంబోకు వ్యవసాయంబాయె...! |
| 40. | వ్యర్థ పరుడవు నీవో నేనో? రా! రా! రమ్మని రయమున ముదమార పిలిచి వరంబు లిత్తునని ముద్దుల పల్కినందుకే మురిపంబున ముద్దుగుమ్మడా! నా గుమ్మము ముందు నిల్వగన్ సందుల దారేటికి నన్ గురించి నా సంగతుల్ నీకు నింకోరు చెప్పంగ వలనా? |
| 41. | నే వరంబులిచ్చు భగవంతుడన్.. నీవా..భగవదనుగ్రహ వీక్షణంబులకై నిలుచు భక్తుడవు ఏ క్షణమున్ వ్యర్థంబున్ సేయక సులక్షణమతివై క్షణమున్ చేరుము...! |
| 42. | నా చిరునామా నీకు లేదే? నేను నానా రూపుండ గానో? ఏల సన్యాసుల పదములంటి తిక్క సన్యాసివై తిరిపము లెత్తుచు తిరిగినన్, వారా! నను జేర్పించు సంధాన కర్తల్...! |
| 43. | మోక్షంబిత్తు రమ్మని.. రా రమ్మని అక్కున జేర్చుకొని రక్షించెదనంచు పల్కితి నిను ఏ క్షణమున్ అలక్ష్యము జేసితి? ఏ లక్ష్యమున్ జేరని నీ జీవితపు పొద్దుల్ అవునే కృష్ణ పక్షముల్...! |
| 44. | పూర్ణ పురుషుండవై! పరిపూర్ణ మూర్తిన్ నీ పరమేశున్ ప్రత్యక్షంబున్ లక్షణంబునన్ చేరగ లేవే! వెళ్లేదారు లేటికి, ఆ గుస గుసల ఏటికి? గుడి చేరుము దారి గుర్తుల్ లేదా? |
| 45. | పుట్టిన నాటి నుండి లంచంబులు పెట్టుట కలవాటు పడిన నీ పెట్టుడు బ్రతుకులకు మధ్య వర్తులకున్ జూపితి వేటికి లంచంబుల ఆశ, ఏ నాటికిన్ తీరని నీదు పోకడల్ నను జేరం నీక దూరం దూరం పోగొట్టు ఆధారం లేక అల్లాడెదవు...! |
| 46. | దగ్గర నేనుండగ, నీ దగ్గర దారుండగ, ఈ చుట్టు తిరుగుళ్లేటికీ? ఆ సిగపట్టేటికి? బొట్టేటికి యతుల కట్లేమిటి? ననున్ చేర నివి దగ్గర దారులా? చేర్పించ లేవులే నా చెంతన్...! |
| 47. | అహా.. కాలంబు ఇది కలికాలంబు బహు కర్కశమాయెనే, నిను కనుటకు ఒక తల్లి, పెంచుటకున్ ఉపమాతలా! వెదజల్లెడి డబ్బులకున్ వెదకకనే వచ్చె వెర్రిదారుల్, ఇన్నిటికిన్ అలవాటునున్నా నన్ జేరుటకున్ మొహమాటం లేటికి? |

| | |
|---|---|
| 48. | పెట్టెడి నీ డబ్బుకు నను జేర్పించు వారు దూతల్ కారు అడుగు అడుగు నే అవధూతనైనన్<br>నీ అదృష్టం పండి నీ కంటన్ పడిన సలక్షణ సద్యోమతులెదురైన నిత్తురు సరియైన సూచనల్...! |
| 49. | సంద్రమున్ జేరు నది ఎదురా కాల్వల సలహాల నడుగునా? అర్థకుండవై, అర్థంబెక్కువై అరచేతన్ అరటి పండు పెట్టినన్<br>ఆ ఆవిర్భావ అవతార రూపుండన్ అరయన్ లేక అడిగెదవా? అడుగడుగున అడ్డదారుల, ఆగమ్మ కాకుల చేరెదవు.! |
| 50. | నీ పుట్టిన నాటి బుద్ధి పుడకల పోవు గాక పెట్టి పుట్టంగ డబ్బు పెట పెట లాడినన్ నాడుగాక అవురా పురుషోత్తమున్<br>పరిపూర్తిగన్ జేర మది లేక లంచపు మూటల వెద జల్లినన్ నా నెదరకు జేర్చ గల వాడెవ్వడున్ వెతికి చెపుమా? |
| 51. | నీ కపటపు వేషంబులు కట్టిపెట్టి కల్మషం వీడి మొక్కినంతనే ముద్దు మోహనుండనై మురళిన్ మోయింతు<br>అవురా మీ మది బృందారక వనమందన్, ముందున్...! |
| 52. | ముందున్, మున్ముందున్, కందుము, కనువిందును కన్పింతు, వినిపింతు వీనులకున్ విశ్వమోహన గీతుల్<br>గోవిందుడనై కనుకన్ నను కన నీ కుంటే నా చరితము పావన రసభరితము నాదు లీలలున్ అరయన్ నీకున్,<br>నాకున్ మధ్య వర్తుల్ రా పని లేదెందున్...! |
| 53. | నీ వన్న నాకున్ కొత్త లేదులే నా గురించిన్, నీకున్ చెప్ప ఆ విరించిన్ నంద బోడులే! నా ఎదుటన్ నిలబడి<br>చేతులెత్తి 'నారాయణ' నన్నన్ ఆదుకొందు...! |
| 54. | నీ చీకటి దారుల చిక్కులు దీర్చ వెలియుదు నే శుక్ల పక్ష చంద్రుడనై...! |
| 55. | నాకున్ నీవు, నీకున్ నేను భిక్ష, రక్ష, మోక్షప్రదాత పెట్టినన్, పుట్టినన్, గిట్టినన్, మనకున్ మర్మంబులు లేక<br>ఏకత్రయ రూపంబున వెల్గొందుటే నా నిశ్చితాభిప్రాయంబు నరనారాయణులు ఒక్కటే ఎందు చూసినన్...! |
| 56. | అన్య మార్గముల్ పట్టి ఓ ముద్దుల పట్టి! నీ వెక్కడ నా దారిన్ గానక పెడదారిన్ పడదువోనని పెక్కు కాలముల్<br>గడిపెదవనుచు నీకున్ తెలియ జెప్ప, నీ మనసున్ తట్టి నీ పేరున్ పెట్టి పిలిచి మరి మరి చెప్పితిన్...! |
| 57. | నే నాశ్రిత పక్షపాతు ననుచున్ అన్నారే లోకుల్ ఆడి పోసికున్నారే ! నా పాద పద్మములన్ నిను జేర్చ<br>పరినిందల్ పడ్డన్ ఓ బిడ్డా! నా కడ్డమా! పరమానంద స్వరూపుండన్...! |
| 58. | నీ అడ్డములను దీర్చి, గడ్డమున్ పట్టి నిశితంబుగ జెప్పితి, సునిశిత బుద్ధివై విను లోకులన్ ఏ మార్చు లోకాలన్<br>ముంచు దొంగ సన్యాసుల్ కారు కాలేరు మార్గదర్శకుల్...! |
| 59. | నీ ఆత్మ పరమాత్మన్ జేరుటకు మధ్యవర్తులా! మన మధ్య సయోధ్యన్ లేకుండెనే...! |
| 60. | పసికందు వంచు అన్య దారుల్ పోదువంచున్ పరి పరి విధముల చెప్పితినే గాని పరులన్ నమ్మి మునుగన్<br>ఆ పరమేశుడైన అడ్డంబడడు సుమీ! నీ దారి గోదారైనన్ నీ బ్రతుకేటికి కాల్చనా! పేల్చనా...! |
| 61. | బిరా! దేముని చూచుటకున్ నీ విచ్చు ఈనాములు నీ ముచ్చు మోహమును నా ఇచ్చకున్ రాలేని నిన్నేనాటికిన్ నా దరికి<br>జేర్తువనుకొంటివేమో! నీ లంచాల బ్రతుకునన్ మంచాల, కంచాల నీ కంచర గాడిద జీవితమునకున్ దోచునే ఇంతకంటే...! |
| 62. | ఆ వసుదేవుడ ఆనాడు పట్టిన గాడిద పదముల్ శ్రీ కృష్ణున్ కాచుటకే సుమా! నీ వీనాడు పట్టిన అడ్డ గాడిదల కాళ్ళన్<br>నా ముద్దుల సుతా! విను ముంచుటే గాక లోకాలన్, సుడుల్ గిర్రున తిరుగుతు, సర్రున నట్టేట నల్గురిని ముంచునే<br>కదా! ముంచినన్ మున్ముందర నా కూరిమి భక్తులన్ అరచేతిన్ నావన్ జేసి రక్షింతు నే మనుకొందువో...! |

| | |
|---|---|
| 63. | నే ప్రత్యక్ష సాక్షినై, కుక్షిన్ నిండి యుండ కాంచలేని నీ అల్పపు బుద్ధుల కాంచ లేక పెడదారుల పట్టిన నీ జీవితపు చిక్కుముడుల్ నే విప్పంగన్ సంసిద్ధతగ లేను అన్నములు వీడి నన్ లీనము గాగ రాదలిచేద వేని మున్ముందు నీలో ఉన్న నారాయణుని తల్లీనత నొంది నీలో నీవు నీ వెవరో కాంచిన నాడు నన్ గాంచుటకు రా...! |
| 64. | కనిపెట్టు మార్గము సులభంబౌ క్షీరమున్ కలసిన నవనీతమున్ వెలసినట్లు నీలో నన్ కాంచుము ఈ మాయపు తెరలు మదిన్ తొలగించు ప్రత్యక్ష మవుదును, నిష్ఠంబుగా శ్రీకృష్ణ పరమాత్మనై...! |
| 65. | కనుకన్ నన్నరయన్ అడ్డదారుల్ దొక్కినన్ విరగంగ గలవు నీ కాళ్ళు పో గలవు నీ కన్ గవలు నీ వెవరో కాంచి ఆపై నను గాంచుము కాదన కిత్తున్ కైవల్య పదము ఆశ్రిత మందార స్థిత రక్షకుడనై...! |

(04) (13-12; నూటఆరవ రోజు)

| | |
|---|---|
| 66. | సంసారమును తృజించి సన్యాస మార్గమును బోవ తమ తనువుల్ తరించ సులభమని తలిచెదరు జనుల్, మూఢమతులై జలమున పుట్టిన జలజమైన, తా జలమున మునగక తన తనువుల్ తరియించన్ జేసున్...! |
| 67. | తానే జలమంచు మునిగినన్ పుష్పించునే జలజమున పుణ్యపురుషుడు నీ పగిదిన్ సంసారం ఈదిన చాలదే...! |
| 68. | పుడమిన్ పుట్టిన ప్రతి జీవిన్ తరియించన్ సన్యాస మార్గం బెంచుకున్నన్, సంసారులు మిగల నేర్తురే నేడు భువిన్, నా సృష్టికిన్ పుష్టిన్ తెచ్చున్ దేవ్వరో? |
| 69. | ఈ సృష్టిన్, పుష్టిన్ చేకూర్చగన్ పుష్పించి సరోజములైన పునః సృష్టికిన్ ధాతలౌటే ఈ విధాత రాతల్ సుమ్మీ కామిన్ గాక మోక్షకామిన్ కానెవ్వరున్...! |
| 70. | మీ మీ పాత్రలన్, మీ మీ స్వధర్మములన్ వేద విదిత కార్యములన్, అతిథిన్, అభాగ్యులన్, దైవపూజలన్, ధర్మంబున్, నెరుపుతు ఆ భగవంతుని చేరి తరించ గలడే ధరణిన్...! |
| 71. | మీ మీ కర్మల కర్తృత్వము మీ పై నుంచక ఫలాపేక్ష రహితులై సర్వమున్ సర్వేషుడిపై పెట్టి నిర్వర్తించినన్ మీ జన్మంబులన్ పుణ్య గతుల చేర్చెదన్...! |
| 72. | గత జన్మ ఫలంబులన్ పుణ్య పాప ఫలంబులన్ సన్యసించినన్ తప్పదు సుమీ మీ జన్మల, కర్మల అనుభవింపక అడ్డము రాదు నీ గడ్డమే పగిదినైనన్...! |
| 73. | దండము చేత బట్టి జింక చర్మంబులు కట్టినన్ అది పగటి వేషంబౌను గాని సన్యాసం కాబోదు అవకాశం బొచ్చినన్ గుడిని - గుడి నందున్న ఆ పరమేశ్వరున్ మింగెడి మీ తృష్ణల్, ఈ వేషం మాన్ప నేర్తునే .! |
| 74. | మృగతృష్ణన్ దప్పిక దీర్చునట్లు నీ సన్యాసముల్, లోక విన్యాసమౌగాని నీకున్ సద్గతుల్ గల్గునా! నే కలిగింతునా! సద్బోధనల్ చేసితిగాని, కామితముల్ నీ మదిన్ కాల్చుచుండ, కపటపు వేషధారివై తరించగ నేర్తువే! కామివి గాక నీ వొక మోక్షగామివా? |
| 75. | సాత్విక మతుల్ సంసారమున్ తమ స్వధర్మముల్ నిర్వర్తించుచున్ తాజేయు కర్మల కర్తృత్వము నందక నిమిత్త మాత్రుడై, సంసారము ఈదిన నాడే.. వాడే అవు అసలైన మానసిక సన్యాసి...! |

| | |
|---|---|
| 76. | సాత్విక మతుల్, ధర్మములన్, కర్మములన్ చేయుచు తగ్గ, యోచన చేసి చేసెడివారే ఉత్తమ యోగులౌదురు — యజ్ఞయాగాది క్రతువుల్ ప్రతి ఒక్కరున్ చేసిన ఈ భువి యజ్ఞకుండమౌ...! |
| 77. | నా దృష్టిన్ సదమల యతివై సాత్విక గుణముల్ గుణించి సేయంతగ్గ చేతల్ చేసి సంసారమునే మానసిక సన్యాసులై, కాయమునన్ నంట కర్మల సేయింతు నవురా! వారే కాములైనన్ మోక్ష గాముల్ అవుదురు...! |
| 78. | కాయము నున్నంతన్ కామితముల్ కర్మముల్, ధర్మముల్ కలుగుచుండినే గాని, తప్పించు గొనగ తరించుదురు బెరా మీ తలపున్ సర్వేశున్ తలచి చేసిన ప్రతి పనికిన్ నా తలపున్ తట్టి నా పదములన్ మీ బ్రతుకులన్ నెట్టి, మీ కర్మల, మీ తలపుల తరియింపన్ చేయనే నే నధికారి నౌతున్...! |
| 79. | మోక్ష మోక్షమని మొరలెత్తినన్, కుక్కల పగిది మొరిగినన్ మొరలెత్తినన్..కాంక్షల్ మిము కుత్తుక బంటి ముంచుచుండ తప్పని కర్మముల్ నీ కాళ్లకు పాశంబులై లాగున్...! |
| 80. | మోక్షంబిత్తునే, జిత్తులమారి నక్కవై నారాయణున్, చేరగ గలవే? నరకమున్ పడబోకముందే నాలుగు విధముల్ సమయోచిత కర్మముల్, ధర్మముల్ అలోచించి, చేసిన నాడే స్వర్గము నొందగలవు...! |
| 81. | లేకున్నన్, లోకుల్ నవ్వగ, నవ్వుల పాలవునే గాని నీ బ్రతుకుల్ నా దరిన్ చేరగ నేర్చునే...! |
| 82. | కాంక్షలు తీరకున్న నీ కాయము కట్టెల కాల్చుదురేని బ్రతికుండగనే ప్రతి క్షణము కాల్చు కామితముల్, చచ్చిన దనుకన్ ఆ జీవులు మోక్షం బందలేక ప్రతిక్షణము ప్రదక్షణము చేయు భువిని...! |
| 83. | మోక్షం బందెద వేని, నీ దగు జీవితాలను నిష్కలమతివై, కపటముల్ లేక నారికేళ సలిలము భంగిన్, నిల్చిన నాడే రక్షణ నిత్తు, మీ జీవితాలకున్ మోక్షం నీ సొత్తున్...! |
| 84. | సుక్షేత్రమైన చోటన్ భగవంతుడైన నేను బలమైన బీజము నాట మొలకై, మొక్కై, మానై, పువ్వై, పిందై ఫలంబులన్ పండ.. పదిమందికి పంచు ఆ తరువు...! |
| 85. | నీ దగు పాప పుణ్య కర్మలకున్ సరిపడు జీవితమునన్ నీకిచ్చిన ప్రారబ్ధము తప్పక అనుభవించి తప్పకచేయలేని తప్పుడు పనులు గాచి, తప్పించలేదని ఆ దేవునిపై నిందల్ వేసినన్ మీ పాపపు బొందలకున్ బొందల కప్పిందాకన్ అర్ధము గాకున్నన్, విడమర్చి చెప్పెద అర్ధార్ధముల్...! |
| 86. | కట్టెలు కొట్టి తెచ్చిన నీ కష్టము నష్టము గాకుండ ఫలితము సరిజూచు నే సర్వేశునై, నష్టము లేని పగిది నీ కిష్టము గాకున్నన్ కష్టఫల కర్మల్ నిచ్చినందుకే ఆ సర్వాధికారియైన సర్వేశున్ స్మరించవచ్చు గదా? |
| 87. | ప్రారబ్ధమున్ తీర్చగలేదని భగవంతున్ ప్రార్ధింపనేరవు అజ్ఞానివై, నే అరటి పండున్ ఒలిచి, నీ చేతన్ పెట్టితి, నోటకు పెట్టన్ ఏ పూటకు నీకున్ నోటనందునో అరసిన చెప్పలేని అర్భకుడా...! |
| 88. | అర్థించినన్ అర్ధము నే చెప్పకున్నన్ వ్యర్ధము కావు మీ బ్రతుకుల్ వేదార్ధములైనన్, అర్ధముగొని అమ్మేటి నీ అజ్ఞానపు బ్రతుకున అర్ధంబగునా...! |
| 89. | సిరుల్, సంపదల్ పంచగ నేరకున్న.. నే ఓరిమి ఊరుకున్న, ఊరుంబడి ఊరపందివైతి ఊరి వారల సొమ్ము కతికినన్, మతిమాలిన మీ హీనపు జన్మలన్ కని క్షమించ నేర్చితిన్...! |

| | |
|---|---|
| 90. | వేదవేదాంగ విద్యలన్ మూటల కమ్మిన నీ మూఢపు అజ్ఞానము నిన్నంధకారమున దోయును...! |
| 91. | నీ పూర్వపు సుకృతంబునన్, పురాణ వేదముల్, జ్ఞాన విజ్ఞానముల్ నీరుగ చేసి నాటిన నారుకున్ పోయ అది తరువై, బరువై, విజ్ఞానపు వీనులన్ వేదఫలములన్ నాల్గు కాలముల వంచు విజ్ఞాన విపంచి ప్రేమించు...! |
| 92. | నీ జన్మలు ముందు తరాలకున్, పరమాత్మనై.. నే నిచ్చిన వేదముల్ నీ అబ్బనిచ్చిన గంటను కుంటివా? పదిమందికి అమ్మక బ్రతుక, నీ బ్రతుకు ఆ శునకము కన్న పది వీసముల్ తక్కువ గదే! మీసమున్ తిప్పకు...! |
| 93. | ఈ విజ్ఞత నీది కాదు, నీ కిచ్చిన కృష్ణపరమాత్మన్ సేతులు యొగ్గి కైమోడ్పన్, కైంకర్యము నిచ్చిన ఆ పరమాత్మన్, పదినోళ్ల పొగుడుమా! విద్యన్ పంచు పదిమందికి వితరణ కలిగి బ్రతికెదవు పది మందిలో నొక్కడిగ నిను మెచ్చగ..! |
| 94. | డబ్బుల్ కట్టలు కట్ట.. నీ తలకిందన్ పెట్టి కాల్చినన్ కానవు ఆనాటి చక్రవర్తుల్, రాజాధిరాజుల్, కోటీశ్వరుల్, దానకర్ణుల్.. వారేరి? ఈనాడు కీర్తిన్ మిగిల్చి కీర్తికాయులై కాలగర్భమునన్ కలిసి పోయిరే! నీవే పాటి చేసెదవు? కనవు రాబోటి కష్ట జన్మలన్...! |
| 95. | నీ డబ్బున్ కలకాలమున్, కట్టి కుడుపుదువే? నీ పొట్టకున్, బట్టకున్ స్వార్థపరుడవై పెట్టవు నల్గురి జీవితాలకున్ అంటక, ముట్టక కాకివలె జీవించినన్ కాంచగలవే కమలాకాంతున్...! |
| 96. | మత్త కోకిలవై సుమన సుగంధ సుపరిమళ సురాగ కుంజిత వేదగానముల్ కువ కువ నీ గళమునన్ రంజితము సేయ నవరాగమంజరి, పంచాయత ధర్మముల్ వేద వేదార్థముల్, పంచకావ్యముల్, మృదు మధుర కుంజితములై జగతిన్ రవరవ మురళీరవములన్, రాగమాలికల్ జేసి పలికింపన్ ప్రతి నొక్క జీవి భక్తిన్ గోపికలవుచు, భగవంతున్ జేరి ముక్తింగన.. ముముక్షువుగా పలికింతు నీ గళమున వేదముల్...! |
| 97. | పది నిముషముల్ మంచిన్ పంచ.. మత్త కోకిలవై మూడు ఘడియలన్ ముదమున బ్రతుకు చాలదా? |

(05) (14-12; నూటఏడవ రోజు)

| | |
|---|---|
| 98. | జగముల్ సృష్టించిన జగత్పతిన్. జగములోనన్ ఉన్న చిన్నా! మీ జనులలో నే నున్న! ఒక మనిషి, ఒక పగిది, ఒక్కొక్కరి నైజమెంచ...! |
| 99. | నీదగు రూపముల్ ఎన్నంగ శక్యమా! అనుచున్ కీర్తింతురు నను ధరన్ మరి మదిం, మీ మనుష్య భావనల్ మరి నెంచన్ మాధవునికైన వశమే...! |
| 100. | కర్మముల్ చేయు నొకడు కర్మ సన్యాసి గాడు ధర్మముల్ చేయునొకడు ధర్మాత్ముడు గాడు.. దానము చేయు వారెల్లరున్ దాతలుం కాలేరు నిందాస్తుతుడు కూడ ఆ ఈశ్వరుండవు నొక నాడు...! |
| 101. | భగవంతుని తలచని భక్తుండు నొకడు భక్తుండ నవుటంచు పరిభంగులన్ పోవు ఒకడు ధర్మము సేతునని విర్రవీగుతు నొకడు వెర్రి బుర్రల తోన వర్ణించున్ నొకడు...! |
| 102. | జగములలో ఈపాటి ఏపాటి కన్నా! నీ బోటి నరులున్న కాలేరు నా పాటి...! |
| 103. | ఒక్కొక్క, నొక్కొక్క, రొక్కక్క పగిది కుక్కటంబు కూతల కొక్కొరొకో యంచు కూయగన్, ఊరు తెల్లార అంచు పుట్టిన నరులెల్ల తాపుట్టుకే జగతికి మేల్కొలుపంచు వెఱ్ఱి ఊహలు చేయు — ఓ పిచ్చి తనయా? |

| | |
|---|---|
| 104. | పక్వమునకు లేని నీ పచ్చి ఊహలు కని.. పిచ్చి నాకొడుకంచు, పిలిచి చెపుతున్నా! నీ యోగ మెటులున్న —<br>నా నీతులే నీకు నా యోగ ఫలమంచు..నీ అర్ధంబు బలమంచు...! |
| 105. | ఆనందించి నేను ఆశీర్వదింతు! వెయ్యి ఊహల నేల చేసెదవు తండ్రి.? అడుగడుగు నేనున్న<br>అడిగి, అడగకున్నన్ ప్రతి అడుగు నే నవుతు అడిగడిగి చెబుతున్న...! |
| 106. | అడగరా నా చిన్నా! అర్ధంబు ప్రశ్నలు, వ్యర్ధంబు సేయకు నీ అజ్ఞానపు ఊహల ఊరించక — నీ ఓర్పున కోర్పుకై<br>ఒకటిం కొకటి, సెవి పెట్టి, చెప్పిన ధర్మముల్ మదినుంచు...! |
| 107. | నన్ కాంచుట కనేక మార్గముల్ కన్నా! మనసున సత్ సంకల్పములు చేసినన్ కాన్పించునే,<br>కదన తురంగమై ఆ పరుగుల నేటికి...! |
| 108. | ప్రశాంత హృదయుడై..పది క్షణముల్ నీ కనులం మూసి ధ్యానించన్ నీ హృది నందు<br>నా పొందున్ అందంగ గలవు ఏ వేళలన్...! |
| 109. | ముప్పొద్దుల్ మ్రింగుటకే నీ బ్రతుకు? పురుషోత్తమున్ సుమధుర నామామృత గుళికల్ మింగుడు పడవేటికి?<br>నిద్దుర పొద్దుల్, నీ జీవిత సహప్రొద్దుల్ మ్రింగక నుండగ ముప్పొద్దుల తిని నిద్రించెద వేల? |
| 110. | అసలే అర్ధాయుషుల్ మీ నరుల్ తిండ్లన్, నిద్దరలన్, తాగుడులన్, కష్టముల్, కచ్చలు, కార్పణ్యముల్,<br>మోహావేశ పరవశులై ముప్పొద్దుల్, మీ జీవితపు ప్రొద్దుల్ క్రుంగగన్...! |
| 111. | బాల్యమందు విద్యార్థి నంచు, యవ్వన మంచు — సంసార మంచు అర్ధమున్ లేని నీ బ్రతుకున్ అర్ధము చెప్పు<br>కొనంగ నిన్ క్రుంగ తీయకుండునే...! |
| 112. | వార్ధక్యంబున్ ముంచుక వచ్చు! ఆనాడున్, నీ నాడుల్ హీనంబులై నారాయణు పలుకంగ నేర్చునే!<br>ముదిమిన్ ఆ ముకుందున్ కనలేవు...! |
| 113. | ముదిమినన్ వైరాగ్యం దెచ్చుకొన సమయంబని, నీ తలపునన్<br>ఆ మురళీ మోహనుని నిల్పం గలవే! నరనరముల బాధల్ క్షణక్షణమున కృంగదీయగన్...! |
| 114. | భక్తులు అనుకొన్న మీ భక్త కోటులందరి లోనన్ ముక్తిన్ చెంద అసలైన ముముక్షువు లెందరో? అరసి చూడగన్...! |
| 115. | ధాన్యమున్ చేటన్ చెరిగి జల్లెడన్ జల్లించి, మట్టిం రాళ్ళన్ తప్పంతాలు ధాన్యమునన్ వేరుం జేసిన, నిల్పు నిండు<br>ధాన్యమున్ దంచిన నాడే నీ నోటికిన్ వచ్చు చక్కటి బియ్యమై...! |
| 116. | ధాన్యమున నీ నోటికిన్ వచ్చునే ఆ రూపునన్ — ఆ సాక్షాత్ శ్రీవిష్ణు రూపము చేరగ<br>దంచక, ఎంచక మిము చేర్తునే, విష్ణు కైవల్య పదముల్...! |
| 117. | నాదగు ప్రియ భాంధవుల్, నా భక్తుల్ త్రిగుణంబులన్ శోభిల్లుదురు, జల్లించి ధాన్యము ఉత్తమమైనదంచు<br>ఎంచిన నీ పగిదిన్, నే పంచితి నా దగు ధాన్యమున్...! |
| 118. | కర్మల సేయు వాడెల్లన్ కర్మ సన్యాసి కాడు — కా నేరేడున్ తా ధర్మ కార్యాచరణంబులన్<br>ఆచరించుచున్ ధర్మిష్టి కాగలవాడు ఏ ఒక్కడో...! |

| | |
|---|---|
| 119. | తా కర్మ, కార్యా చరణంబులన్ ధర్మమున్ చేసితి ననుచు గర్విష్ఠిలా భక్తుల్ ధరణిన్ ఎందరో?<br>సాత్విక మతుల్ తానేదిన్ కోరక తనదగు ధర్మంబు సేయుదురే ధన్యుల్...! |
| 120. | సాత్విక మతుల్ తానేమియున్ కోరక తన దగు ధర్మ కర్మముల్ సేయు తన మదికిన్ కష్ట సుఖముల అంటనీయక అతీతుడై అతడే నాదగు పదముల చేరెడి ఉత్తమ భక్తుండౌ...! |
| 121. | శ్రీకాంతుడైనన్ పదమంటి అర్థించినన్ వ్యర్థములా బ్రతుకున ఒక అర్థం బిత్తు! చేసినన్, చేసితినంచు<br>తప్పెటల్, తాళంబుల్ మ్రోయించ ఆ అరాచకపు భక్తుల్ ముక్తులన్ సేయగ గర్వం బణతునే...! |
| 122. | భగవంతుని దర్శన కాంక్షలతో సందర్శించన్ ఆ భక్తుల దారి సుమగం జేతు నే భగవంతుడనై..<br>కించిత్ బాధనైనన్, ముక్తిన్ చేరుదువే? |
| 123. | అడుగడుగు అర్థించినన్ అడిగడిగి నే కైదండల్ సేతు: అడిగడిగి నీ ప్రతి అడుగున్ నా అడుగున్ కల్పుదు...! |
| 124. | నీకై గళమెంచి నీ భక్త మాల.. నా మెడన్ ధరింప చేసుకొందునే! భక్తార్తి భంజనుడ! భక్త వత్సలుడ భక్తికిన్ బంటునై నిల్చున్న నీ సాయినాథుండ...! |
| 125. | కష్టం పడినన్ నే ఇష్టం పడురీతి ఇష్టార్థంబుల్ కోరక విష్టాంకితులౌదురు జగతిన్ నిజమగు ముముక్షువుల్...! |
| 126. | త్రిగుణములన్, త్రివిధములై భక్తుల్ నొప్పారెదరు సహజ ప్రవర్తుల్ తమ తమ జన్మ సుకృతములన్<br>తరియింప తనువులు అయా చోట్లన్ ఉద్భవింతురు...! |
| 127. | తమదగు పుట్టుకలన్ ఈ సుకృతంబుల్ ప్రభవించన్ వర్తింతురు.. జన్మ కర్మాను సారమున్ తమ ప్రవృత్తుల్ నివృత్తుల్ తమచే జనియించినంచు తలతురు మూర్ఖుల్...! |
| 128. | సాత్వికమతుల్ ప్రతి అడుగునన్ ఆ ఆది నారాయణుం గాంతురు.. పూజల్, ముడుపుల్,<br>ధర్మ కార్యాచరణంబులన్ సేయుట తమ ధర్మంబని తమ స్వాభికము నొప్పారు సహజ ప్రవర్తులై...! |
| 129. | కాయమునన్ కందగ నీక, సుఖంబునన్ పెంచి పోషించినన్ కాలంగతి నొందక ఉండునా?<br>కాలంబు నోటన్ ఏ పూటన్ పడి నశించుదువు...! |
| 130. | జలజం జలమున పుట్టిన అనుక్షణమున్ అన్వేషించు ఆ ఆదినారాయణున్ తా మునగదు, తనదరిన్<br>చేరిన వారిని దర్శింపగ కాంక్షింతు...! |
| 131. | సాత్వికమతుల్ సద సద్విరేఖ ప్రవర్తనల సరళత్వ రీతుల సద్యోజ్యోతులై ఆ సరసిజనాభుని చేరుదురు సతతము సత్ప్రవర్తనులై...! |
| 132. | నాదగు ఈ రకపు భక్తుల్, ఆణిముత్యముల్ : జగతిన్ నిల్చు సత్యమై నీటన్ వేసినన్ — నడి నిప్పున్ నిల్పినన్ నిశ్చల మతులౌదురు — నిజ ధర్మ కర్మ లంచున్...! |
| 133. | కొందరు భక్తులైనన్ — నిత్య భక్తి పరాయణతన్ భజనల్ సల్పుదురు — ఆ భజనలందన్ ముకుందుని పొందెడు పొద్దులన్, నిజ భజ పరులై తామే జగతిన్ నిల్ప ఉద్భవించి ననుచు నొక్కించెప్పుదురు...! |
| 134. | వారే ధ్యేయమున్ జేరగ లేక — అధ్యాయనముల్ సేతురు అనుక్షణముల్ గర్వితులై...! |

| | |
|---|---|
| 135. | ఫలమున్, పుణ్యఫలమున్ అందగ లేక కర్మము, ధర్మము నిర్వర్తించుచున్ పాప కర్ముడై పోవు వ్యర్థముగా<br>ఈ రాజస గుణమతి రక్షింప ఏ పరమేశ్వరుడిట అరుదెంచునో? |
| 136. | తామే గుడుల్, బడుల్ కట్టించితి మంచు గుండెలు కొట్టుక గొంతులు పెట్టుకొని అరవ నేటికిన్?<br>తా బడుల్ గుడుల్ కట్టించకున్న జగతి కూలోవునా? |
| 137. | జగజ్యోతుల్, సద్గుణ సంపన్నుల్, సాంప్రదాయ దాతల్, అనుక్షణముల్ పుట్టుదురు.. పుట్టుచున్ తమ తమ విధులన్<br>నిర్వర్తింతురు గిట్టినన్ తమ సహజ ప్రవర్తపు రీతుల కీర్తిన్ అనామకులై అనాది పురుషున్ చేరి సుఖించిరే! |
| 138. | కర్మలన్ కర్తృత్వాది కారిని నేనుండగన్, లోక కంటకుడౌ నీ చేతన పెత్తనము పెట్టుదునే వెఱ్ఱినై! ఆ గొర్రెల కాచెడి<br>చిన్న పిల్లడినే కాను ఆల మందలన్, జ్ఞానమార్గమున్ నడిపింప నేర్చిన శ్రీకృష్ణ పరమాత్ముడనే...! |
| 139. | పిల్లం గ్రోవి పిలుపులకున్ పరవశింతురు నాదగు ఆన మీదనే, ఆ గోపికల అడుగుము,<br>అడుగడుగు అడుగుము, అర్థించినన్ భక్తుల కలిపెదనేమో? |
| 140. | అదృష్టమున్నన్ నా అడుగులకు మడుగున్ వత్తెడి ఆ గోపికవై అడుగడుగున్ అనురాగ వీచికల్<br>అవనంతన్ భక్తి పులకింతల్ పెట్టుచు నను సేరగ నీకిత్తు, అనురాగ మూర్తినై ఒక చిన్ని అవకాశమున్...! |
| 141. | కానిన్ అనుక్షణమున్, నీవు చేసిన పుణ్యకార్యములంచు అహంకరించినన్, అడుగడుగున పాతాళ మడుగంట<br>నీదగు అజ్ఞానంబున్ బోవ నా అడుగుల్ నీ కుత్తుక నొత్తుగ ద్రొక్కెద అడిగినన్ కారణము అరయగ నేమి...! |
| 142. | తామస గుణఖలుల్ పాపపు సులకం మంచపు పగులన్ వీడి జ్ఞాన మార్గమున్ దాయక ఇచ్చగించరే!<br>పచ్చి నెత్తురుల్ గ్రోలెడి నీకు పంచామృతముల్ గ్రోల అదృష్ట మెచ్చునే!<br>ఏనాడో పుటుక్కున చత్తురు, పరుల కంటంబడగ తామస గుణ గని తరించు ప్రశ్నల్ లేవు, పరి ప్రశ్నేమిటికిన్...! |
| 143. | ఇంతల కింతలు పదింతల్ చెప్పినన్ ఎవ్వడున్ నా పాదముల దరిజేరి పరవశింపం గలవాడో వాడికి అర్థంబగు,<br>నా దరిజేరుట కర్హుడగుటన్ నాకేటికి ఈ చింతలు మీ చింతల మీ చెంతన్ ఉంచు కొనంగ ఘనుల్ గదా...! |
| 144. | ఆ చేతనా చేత చైతన్య మూర్తిన్ నా చెంతకు చేరిన అత్యంత ఆత్మీయుల నే బ్రోతున్, కాతున్...! |
| 145. | కనుకన్ ఓ..రాజస కర్ముడ చేసిన చేతల గొప్పగా చెప్పుటే నీ నేరము<br>నేడా రాజర్షి పగిదిన్ చేయకనే ఫలితం వచ్చు — "సర్వస్య శరణాగతి" చేసిన చాలే...! |
| 146. | దేవుని దర్శింప కాంక్ష నీ కుంటే నిన్ నే కననంటే, ఆపై గదా పక్కసందుల్, గొందుల్, లంచాలన్, సుఖ శయన<br>మంచాలన్, సుందరతర శోభించు గదుల్, సుఖము అన్వేషించనా ఆ భోజనపు రుచుల్...! |
| 147. | పద పద అని నేటికే ఆ పరమాత్మన్ కాంచన్, నీదగు కాన్కల ముంచన్ కాంక్షించన్ నే ఏ నాటికిన్,<br>ధనముల్ ఉండినన్, దర్శింపగ నేర్తువే! ఆ సుదర్శనున్...! |
| 148. | చక్రము తిప్ప నేర్చితిని ఏడేడు భువనంబులన్ నీ నక్కం వినయంబుల నే పడుదునే!<br>నా పక్కకు వచ్చు మార్గమున్ మూసుకుపోయె నీ మూర్ఖపు కాంక్షలతో...! |
| 149. | కరిన్ గాంచిన ఆ కమలాక్షున్ కాంతన్ వాహనంబులన్, చక్రముల్, కిరీటముల్ సర్వమును త్యజించి,<br>ఉన్న పాటునన్ భక్తున్ కాయ పరుగున వచ్చిన భక్తాగ్రేసరుడు...! |

| | |
|---|---|
| 150. | నన్నున్ జేరగ నీకిన్ని సౌఖ్యముల్ కాంచగ నే నిత్తునే ముక్తిన్, నీ దగు ముద్దర ముడుపుల ఏ శక్తిం లేదు, భక్తిన్<br>కాంచగ దారొక్కటే రక్తిన్ విడుము...! |

### (06) (15-12; నూటఎనిమిదవ రోజు)

| | |
|---|---|
| 151. | జగమున్ జీవుల్ సర్వసముల్ నాకు రాజున్, పేదన్, దోమన్, హస్తిన్<br>గుణ భేదము లెంచక సమవర్తినై నొక పగిది చూచెద సమదృష్టిన్...! |
| 152. | ప్రతి ప్రాణికిన్ పూర్వ జన్మ ప్రారబ్దమున్ నెంతయో నంతయు వెంటన్ రాగ<br>ప్రారబ్దం కరగంబోవ తరతమ అదృష్టమున్ వెంటన్ అంట తారతమ్యము లొచ్చెన్...! |
| 153. | జగమున జీవుల సృష్టించక మున్నె బియ్యపు గింజలన్ సృష్టించితి<br>కీటకము నుండి.. మానవుల వరకున్ ప్రాప్తము నుండెనేని సంప్రాప్తములౌ ఫలముల్...! |
| 154. | కాటకం వేటికి పెట్టన్ కరువున్ పడం దోయగ ఎవరికి క్రిందటి జన్మన్ ఎంతెంత పెట్టితివో,<br>అంతంతే నీ పుట్టిన చోటన్, పొట్టకు పెట్టన్...! |
| 155. | బండన బ్రతుకే కష్ట అయినన్ భోరున ఏడ్వదు తన బ్రతుకుకు ఆ కష్టకైనన్ అందించెద బ్రతుక తిండి నే భగవంతుడినే...! |
| 156. | నాకున్ అందరు ఆత్మీయులే ఆ భగవంతుని ఏమిచ్చెనటంచు నన్నాడి పోసినన్<br>ద్వేషము లెంచక అనురాగమున జూతు.. పరమ శత్రువునైనన్...! |
| 157. | నేనున్ సమవర్తినే నాకున్ నలుగురు సమానులే నానా మాటలాడినన్<br>మీ మీ గుణముల నాకు తెలియగ జెప్పినన్ తెల్పెద నే నొక్క నిజమున్...! |
| 158. | నాకున్ గుణమే లేదు — నిర్గుణుండ మీ మీ గుణముల బట్టి ఆయా గుణముల ఆరోపించినన్<br>నా నిజగుణమైన నిర్గుణతత్వమునన్ భాసిల్లెద, భావించక భవమంతన్ నాదు భక్తులే...! |
| 159. | మనిషి, మనిషికిన్ నొక్క పగిది భగవంతుని భావింతురు, అది నీ భావంబే!<br>నా భావంబున నే భాసించిన అది నా నిజ భావంబే తెల్పున్ చూడన్...! |
| 160. | ఒకరి భావనల్ మరి నొకరిని కల్గించు అనురాగ ద్వేషంబుల్ కామెర్ల రోగికిన్ కనపడునే ఇలనంత పచ్చగ...! |
| 161. | భావంబున్ బట్టి భగవంతుడైతి.. నీకై నీ భావనలకై ఏనాడున్ కైమోడ్చి వింతల్ సేయగ లేదు<br>వంతల్ కల్పించగ లేదు కన్పించిన వన్ని నీ భావంబుల అనుగుణంబే...! |
| 162. | నీ గుణము నీ యందు నొప్పున అలరారినన్ మెప్పుంగాక మరొక గుణనిధికది తప్పుంతోచున్<br>సుఖమున్ ఓలలాడ సన్మత మతివైన దోచు మరి ఒకరికి దుఃఖ దుశ్చరితల్ గన్...! |
| 163. | ఏ గణమున పుట్టిన ఆ గుణమందు గణ గణ, నవ గణ గణంబులలో ఒకరి గుణము మరి యొకరికిన్<br>కల్గించు సుఖః దుఃఖ ద్వేషముల్ ఎవరి నిజ గుణములన్ అలరారినన్ నిజమింతే సుమ్మా...! |
| 164. | మీ గుణము లెన్నన్ ఎన్నెన్ని ఎన్న ఓ చిన్నన్నా! సాయన్నా! అన్న నీ అవగుణముల్ హరించి హరిపద కైవల్యం బిత్తున్ |

| | |
|---|---|
| 165. | నా పదములు ఎవరు ఏనాడు ఎపుడు శరణన్నన్ పరమ దయతో పాలింతున్<br>నన్ ఆత్మీయుడవై ఆశ్రయించినన్ శ్రమన్ బాపి శ్రేయస్సు నిచ్చెద, శిరిడీ చేరినన్...! |
| 166. | నే ఆశ్రిత మందారుడ, సలహా అడిగినన్, సంప్రదించినన్ సమాధి పలుకు, సమస్యల దీర్తు<br>చేయుము సర్వస్య శరణాగతిన్...! |
| 167. | మరణించితినని భావించకు మరలకు సాయి మమతల దారిన్ మరణం మున్నదే!<br>నా భక్తులన్ మరణించనీక వరంబులిచ్చువాడ మరలితిన్ నా నిజ ధామమునకున్, మరలి వచ్చెదన్...! |
| 168. | ఏ దారినో పడి కాకు, పలు కాకివై పోకు .. నీ సాయి మహాత్ముడున్ నీ ఆత్మనందే ప్రతిక్షణమున్<br>అలరారుచుండె, కంటన్ నీరేల నే కాంచుచుంటి ప్రతి క్షణముల్....! |
| 169. | అండము నుండి పిండము అందనుక చెప్పితి నయమున, భయమునన్ నాదు రీతులన్<br>బోనాడి, విపరీత రీతులన్ బోతువే విను తరించు చిన్న గీతైనన్ నీ రాతన్ ఉన్నదే...! |
| 170. | నా చేతన్, నీ రాతన్ పెట్టితివేని శ్రద్ధన్, సబూరిన్ చూపితివేని<br>వైకుంఠం బొదలి కదిలి నిలవనా నీ మానస మందే, నిల్పనా నిను నామది యందున్...! |

ఓం ఓం ఓం